


2026కి హార్బర్ విస్తరణ

- పర్యాటకం, ఆక్వారంగంపై దృష్టి పెట్టాలి
- బీచ్ ఫెస్టివల్ ద్వారా పెట్టుబడులకు ఆహ్వానం
- సదస్సు ముగింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్గనిర్దేశనం విపత్తుల దృష్ట్యా ఆర్టీజీఎస్ కోరిన కలెక్టర్ వినోద్‌కుమార్



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులు 2026 మార్చి కల్లా పూర్తయ్యేటట్లు చూడాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సూచించారు. రాజధాని అమరావతి వెలగపూడి సచివాలయంలో రెండు రోజులు జరిగిన కలెక్టర్ల సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్, ఎస్పీలకు ముఖ్యమంత్రి మార్గ నిర్దేశనం చేశారు. జిల్లాలో పర్యాటక, ఆక్వా రంగాల అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిపై మరింతగా దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకానికి సంబంధించి క్షేత్రస్థాయి ఫలితాలు కనబడాలని తెలిపారు. సూర్యలంక తీరంలో జరిగే బీచ్ ఫెస్టివల్ కోసం రూ.3 కోట్లు కేటాయించిందన్నారు. బీచ్ ఫెస్టివల్ ద్వారా పెట్టుబడులకు ఆహ్వానం పలకాలన్నారు. ఆక్వా ఇంటిగ్రేటెడ్ పార్కు నిర్మాణంతో పాటు ఆక్వారంగం గ్రోత్ ఇంజన్‌గా ఉపయోగపడుతుందని, ప్రత్యేక ప్రణాళికలు రచించుకోవాలని సదస్సులో సీఎం చెప్పినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, మున్సిపాలిటీ, కాలుష్య నివారణతో పాటు అటవీశాఖ ప్రగతిపై సీఎం సమీక్షించారు.

విపత్తుల దృష్ట్యా..

జిల్లాలో ఎక్కువగా విపత్తులు సంభవిస్తుంటాయని, తుఫాన్లు కూడా అధికమేనని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్)ను జిల్లాకు ఇస్తే బాగుంటుందని సదస్సులో భాగంగా ముఖ్యమంత్రిని కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. దీనికి సీఎం స్పందిస్తూ సెల్‌ఫోన్ చేతిలో ఉంటే రియల్ టైం ఉన్నట్లేనని, రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఫోన్ చూసుకుంటే తెలిసిపోతుందని చంద్రబాబు తెలిపారు. అనవసర ఖర్చుకు కూడా దూరంగా ఉండాలని కలెక్టరేట్‌లోని సిబ్బంది ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకుంటే చాలని సీఎం సూచించారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా జిల్లాలు ఉండాలంటే శాంతి భద్రతలే కీలకమని తెలిపారు. అప్పుడే పెట్టుబడుదారులకు భరోసా కలుగుతుందని ఎస్పీల సమావేశంలో సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం.



అమృత్ పథకంలో నరసరావుపేటలో నిర్మించిన వాటర్ ట్యాంక్

అమృత్.. అంతేనా

టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం

- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు
- మునిసిపల్ పరిపాలనా విభాగంలో కదలని దస్త్రం
- పెరిగిన వ్యయం రూ 43.70 కోట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం అమలు అడుగు ముందుకు పడటలేదు. పురాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం కాక పౌరులు ఇక్కట్లు పడుతున్నా అమృత్ పనులు ఇప్పట్లో చేపట్టే పరిస్థితులు లేవు. రాష్ట్రంలోనే తొలి సారిగా అమృత్ పథకం 2.0 కింద చేపట్టే ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. ఇప్పటి వరకు జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీని, మునిసిపాలిటీల్లో చేపట్టే ప్రగతి పనులకుఅమలు చేస్తోంది.

50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తోంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహించాలి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అమృత్ 2.0 పథకం పనులను ఒకే ప్యాకేజి కింద టెండర్ నిర్వహిస్తున్నారు. పనులకు సబంధించిన టెండర్ నిర్వహణ వాయిదాల పర్వంగా మారింది. ఇప్పటికే రెండు సార్లు టెండర్ వాయిదా వేసిన విషయం తెలిసిందే. ముచ్చటగా మూడోసారి టెండర్ పిలిచేందుకు అధికారులు సమాయత్తమైనా ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడంలేదు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాలిటీల్లో రూ. 1092.40 కోట్ల వ్యయంతో పీపీపీ తరహా విధానంలో ప్రజారోగ్యం,మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ప్రగతి పనుల టెండర్‌ను పిలిచినా రెండు సార్లు వాయిదా పడింది. ప్రామాణిక రేట్లు పెరగడంతో పనుల వ్యయం రూ 1,136 కోట్లకు పెరిగింది.

రోడ్డు వేసి ఇబ్బందులు

తొలగించండి

- చెన్నుంబొట్లఆగ్రహారం వాసుల డిమాండ్
- వాడరేవు-పిడుగురాళ్ల హైవేపై రాస్తారోకో

పర్చూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాడరేవు- పిడుగురాళ్ల హైవే నిర్మాణంలో పర్చూరు మండలం చెన్నుంబొట్ల ఆగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి హైవే నుంచి తమ గ్రామానికి రాకపోకలకు అనుమతించాలంటూ గ్రామస్థులు గళమెత్తారు. మంగళవారం హైవే పనుల కోసం వినియోగిస్తున్న వాహనాలను నిలుపుదల చేసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమ గ్రామానికి రాకపోకలు సాగించేలా ఉన్న రోడ్డు హైవే నిర్మాణంతో అనావాళ్లు కూడా లేకుండా చేశారన్నారు. దీంతో రాకపోకలు సాగించలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. హైవే అధికారులు హామీ ఇస్తే తప్ప ఆందోళనను విరమించేది లేదని భీష్మించారు. సమాచారం తెలుసుకున్న హైవే అధికారులు మూడు రోజుల్లో దెబ్బ తిన్న రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బం ది లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న చెన్నుంబొట్ల ఆగ్రహారం గ్రామస్తులు



రెండేళ్ల నుంచి మూతపడి ఉన్న హద్దు రాళ్ల తయారీ యూనిట్

రూ.16 కోట్ల వృథా

- మూలనపడిన సర్వే రాళ్ల తయారీ యూనిట్
- పట్టించుకోని ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు

బల్లికురవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను అలాగే వదిలేస్తున్నారు. దీంతో రూ.కోట్లలో ప్రజాధనం వృథాగా మారుతోంది. బల్లికురవలో గత ప్రభుత్వం రూ.16 కోట్లతో ఏర్పాటు చేసిన సర్వే హద్దు రాళ్ల తయారీ యూనిట్ రెండేళ్లుగా వినియోగం లేదు. దీంతో యంత్రాలు తుప్పు పడుతుండగా, షెడ్లు కూలిపోతున్నాయి. రెండేళ్ల నుంచి పరిశ్రమ మూతపడినా ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బల్లికురవలో ఓ రైతు వద్ద ఆరు ఎకరాలను మూప్పై ఏళ్లకు లీజుకు తీసుకుని 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం సర్వే హద్దు రాళ్ల తయారీకి ఖనిజాభివృద్ధి సంస్థ సుమారు రూ.16 కోట్లను వెచ్చించి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. సర్వే హద్దు రాళ్లపై జగన్ ఫొటోతో మొదట్లో కొంతకాలం హద్దు రాళ్లు తయారు చేసి వివిధ ప్రాంతాలకు తరలించారు. బల్లికురవ ప్రాంతంలో అత్యధికంగా గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఉన్నా రూ.కోట్ల నిధులను తమకు అనుకూలమైన వారికి కట్టబెట్టేందుకు ఖనిజాభివృద్ధి సంస్థతో ప్రత్యేకంగా యూనిట్‌ను ఏర్పాటు చేయిం చిందన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఏపీఎండీసీ హద్దు రాళ్ల తయారీ యూనిట్‌ను గ్రానైట్ వ్యాపారులకు అద్దెకు ఇస్తే ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ఉంటాయని ప్రజలు అంటున్నారు.



తుప్పు పడుతున్న మిషనరీలు



నిరుపయోగంగా రాళ్లు ఎత్తే క్రేన్

సీసీఆర్‌సీ జాప్యం

కౌలు రైతులకు శాపం

- కార్డుల జారీ లక్ష్యం లక్ష.... ఇప్పటికి ఇచ్చింది 45,000
- కౌలు రైతులకు అందే రాయితీ ప్రయోజనాలపై ప్రభావం
- సేద్యంలో కౌలు రైతాంగమే అధికం
- అవగాహన కల్పిచడంలో యంత్రాంగం విఫలం

వ్యవసాయానికి ఊతమివ్వడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. కౌలు రైతాంగానికి వాటి తాలూకా రాయితీ ఫలాలు అందాలంటే సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్) కలిగి ఉండాలి. జిల్లాలో సేద్యం చేస్తున్న వారిలో కౌలు రైతులదే అధికశాతం. వైసీపీ ఐదేళ్ల పాలనలో కౌలు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. సీసీఆర్‌సీ కార్డుల జారీలోనూ తలాతోక లేని నిబంధనలతో వారిని తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. ఈ ప్రభుత్వంలో గతేడాది జిల్లా వ్యాప్తంగా దాదాపు 78,000 వరకు కౌలు రైతాంగానికి సీసీ ఆర్‌సీ కార్డులు ఇవ్వగా, ప్రస్తుత సీజన్‌లో లక్ష కార్డుల లక్ష్యాన్ని వ్యవసాయశాఖకు ప్రభుత్వం విధించింది. కార్డుల జారీలో ఆశించినంత వేగం కనిపించకపోవడం కౌలు రైతులకు శాపంగా మారింది. 11 నెలల గడువుతో ఇచ్చే ఈ కార్డుల విషయం లో కొన్ని పునరుద్ధరించడం, మరికొన్ని కొత్తవి జారీ చేయడం జరగాల్సి ఉంది. లక్ష కార్డుల జారీ లక్ష్యాన్ని సెప్టెంబరు చివరికి పూర్తి చేయాలనేది ప్రభుత్వ ఆదేశాలుగా ఉన్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే దాదాపు మూడు నెలలు దాటింది. వార్షిక పద్దులో భాగంగా అన్నదాతలకు బ్యాంకులు ఇచ్చే రుణాలు కూడా దాదాపు 70 శాతం చేరుకున్నట్లు తెలుస్తోంది. కానీ కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్‌సీ కార్డుల సంఖ్య మాత్రం ఇప్పటి వరకూ 45,000కు మించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం



అందించే ఎరువుల సబ్సిడీ, బీమా పరిహారం, విత్తనాల రాయితీతో పాటు బ్యాంకులు అందించే రుణాలకు కూడా సీసీఆర్‌సీ కార్డే ప్రామాణికంగా ఉండనుంది. కానీ లక్ష్యంలో 50 శాతం కూడా ఇప్పటి వరకు పూర్తి కాకపోవడం కౌలు రైతాంగం ప్రయోజనాలను కాలరాసే విధంగా ఉంది. అంతే కాకుండా సీసీఆర్‌సీ కార్డుల విషయంలో భూయజమానులకు ఉన్న అపోహలు తొలగించడానికి గ్రామాల వారీగా అవగాహన సదస్సులు పెట్టాలని గతంలోనే ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. క్షేత్రస్థాయిలో ఈ నిర్ణ యాలు ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేకపోగా, సీసీఆర్‌సీ కార్డుల జారీ నత్తనడకకన సాగడానికి భూ యజమానుల సహకారం దక్కకపోవడం కూడా ఓ కారణంగా కనబడుతోంది.

కౌలు రైతులే అధికం

జిల్లాలో దాదాపు 3.75 లక్షల ఎకరాలు ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం కాగా రైతుల సంఖ్య రెండు లక్షలుగా ఉండనుంది. ఇందులో కౌలు రైతులే దాదాపు లక్షన్నర వరకు ఉండనున్నారు. ప్రభుత్వం గతేడాదితో పోలిస్తే కౌలు రైతులకు ఇచ్చే సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యాన్ని 20,000 పెంచి లక్షకు చేర్చింది. సేద్యానికి సంబంధించి ప్రభుత్వం అందించే ప్రతి రాయితీ పథకం కౌలు రైతుల చెంతకు చేరాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్డుల జారీ సంఖ్యను భారీగా పెంచింది. కౌలు రైతులకు బ్యాంకులు ఇచ్చే రుణాల విషయంలో కూగా ఈ ఏడాది గణనీయంగా పెరుగుదల కనబడాలని కూడా ప్రభుత్వం బ్యాంకర్లను కోరిన సంగతి తెలిసిందే

సెప్టెంబరు చివరి కల్లా..

నిర్దేశించిన లక్ష కార్డుల లక్ష్యాన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలిచ్చింది. నిజానికి జూన్ మొదటివారం నుం చే సీసీఆర్‌సీ కార్డుల జారీ ముమ్మరంగా ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ అధిక శాతం కార్డుల రెన్యువల్ గడువు ఆగస్టు, సెప్టెంబరు నెల చివరికి పూర్తవుతుందని, ఆ సమయానికి వంద శాతం లక్ష్యం చేరుకుంటామని యంత్రాంగం చెప్పింది. కానీ సెప్టెంబరు ముగింపుకొచ్చినా ఇప్పటికీ 50 శాతం కార్డుల జారీ కాకపోవడం వ్యవసాయశాఖ ఉదాసీనతగా కనబడుతోంది. మరో వైపు ప్రకృతి విపత్తులతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇటీవల ఎడతెరిపి లేని వర్షాలకు వరిపైరు ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో అధిక శాతం మంది కౌలు రైతులే కాగా ప్రభుత్వం ఇస్తానన్న రాయితీ విత్తనాలు వీరి దరికి చేరాలన్నా కూడా సీసీఆర్‌సీ కార్డు వారికి జారీ అయి ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో చాలా మంది కౌలు రైతాంగం వద్ద సీసీఆర్‌సీ కార్డు లేకపోవడంతో రాయితీ ఫలాలు అందని పరిస్థితి కనబడుతోంది. ఈ బాలారిష్టాలతో పాటు సీఆర్‌సీ కార్డుల విషయంలో భూ యజమానులకు ఉన్న అపోహలు కూడా జారీకి ప్రతిబంధకంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.



వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

సీఎం పర్యటనకు

విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు, (వెలగపూడి) సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ నియామక పత్రాలు అందజేయనున్న ప్రాంగణంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 19వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర ఎన్-9 రోడ్డు వద్ద డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రా లు అందించే కార్యక్రమం జరుగనుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సంబంధిత ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలిలతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌లను, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తుళ్లూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ము రళీకృష్ణ, జిల్లావిద్యాశాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పాలన

- వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలకు చేరువ
- అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చర్యలు
- స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. మండలంలోని జంపనిలో మంగళవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టామన్నారు. అన్ని సేవలను ప్రజలకు చేరువచేయాలన్న సంకల్పంతో పౌర సరఫరా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తూ స్మార్ట్ కార్డులను ప్రవేశ పెట్టామన్నారు. పీ-4 పథకం ద్వారా పేదరిక నిర్మూలనకు శ్రీకారం చుట్టామన్నారు. 2027 కల్లా ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు ముఖ్యమంత్రి బృహత్తరమైన ప్రణాళికను రూపొందించారన్నారు. రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగన్ ప్రజాధనాన్ని వృథా చేయడంతో పాటు రేషన్ వ్యవస్థను కూడా పాడు చేశారని విమర్శించారు. గతంలో రేషన్ పంపిణీలో 2జీ నెట్‌వర్క్ కారణంగా సర్వర్ల సమస్యలు ఏర్పడ్డాయని, ఇప్పుడు 5జీ నెట్‌వర్క్ వినియోగం ద్వారా రేషన్ పంపిణీ వేగవంతంగా సాగుతుందన్నారు. వేలిముద్రలు పని చేయకపోయినా స్కాన్ ద్వారా కానీ స్వైప్ ద్వారా స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికారి ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వేల్పూల రవిప్రసాద్, యార్డు ఉపాధ్యక్షుడు అమ్మిశెట్టి కిశోర్‌బాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్ హనీఫ్, న్యాయవాదుల విభాగం కన్వీనర్ జయప్రకాష్, గవిని లక్ష్మీదుర్గ, వట్టిప్రోలు యోబు, బీసీ సంఘ నాయకులు పల్లా వాసుదేవనాయుడు, పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డి పాల్గొన్నారు.



జంపనిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



చీరాలలో డివైడర్ల మధ్య మొక్కలు

లెక్కల్లోనే.. మొక్కలు

- ఆర్భాటంగానే వన మహోత్సవాలు
- మొక్కల సంరక్షణల్లో అంతులేని నిర్లక్ష్యం

చీరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవాలు ఆర్భాటాలకే పరిమితమవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారే కానీ క్షేత్రస్థాయిలో మొక్కలు కనిపించడంలేదు. లక్షల్లో మొక్కలు లెక్కలు చూపుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ లెక్కలకు, మొక్కలకు పొంతన ఉండటం లేదు. పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకునేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు సూచిస్తున్నా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడింది. చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులు, అద్దంకి 20 వార్డులు, బాపట్ల 34 వార్డులు, రేపల్లె 28 వార్డుల్లో లక్షల మంది జనాభా ఉన్నా పర్యావరణ పరిరక్షణపై అధికారులు దృష్టి సారించడంలేదు. పేరుకే మొక్కలు నాటుతున్నారు కానీ వాటి పర్యవేక్షణ కానరావడంలేదు. దీంతో మొక్కలు మూణ్నాళ్ల ముచ్చటకే పరిమితమవుతున్నాయి. నీరు సకాలంలో అందకపోవడంతో మొక్కలు నాటిన వెంటనే ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వంలో మాదిరిగా అరకొర మొక్కలు నాటే కార్యక్రమాలకు చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం జియో ట్యాగ్ విధానం తెచ్చింది. అయినా మొక్కల లెక్కలు తారుమారవుతున్నాయి. లెక్కల్లో చూపినవాటిలో పది శాతం మొక్కల పర్యవేక్షణ జరగడంలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అంచనా వేయవచ్చు.

ఈ సారైనా సంరక్షణ ఉండేనా?

పట్టణాల్లో రహదారుల వెంబడి ఎవెన్యూ కల్చర్(రోడ్ల వెంబడి మొక్కలు నాటడం)పై అధికారులు తాజాగా అంచనాలు సిద్ధం చేశారు. గతంలో నాటిన మొక్కల ప్రదేశాన్ని మినహాయించి మిగిలిన చోట మొక్కలు నాటేందుకు ఎన్ఆర్ఈజీఈఎస్‌శాఖకు అధికారులు సూచనలు చేశారు. త్వరలోనే వాటిని కార్యరూపం దాల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సారైనా అనుకున్న మేర మొక్కలు నాటి ప్రభుత్వ లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలని ప్రజలు భావిస్తున్నారు.

ఆదాయం పెంపునకు మార్గాలను అన్వేషించండి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ ఆఫ్ ట్రైనర్ శ్రీనివాస్ రెడ్డి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆదాయం పెంపునకు నూతన మార్గాలను అన్వేషించాలని మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు వచ్చే పన్నుతో పాటు ఇతర ఆదాయం మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని సూచించారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. మాస్టర్ ట్రైనర్స్ వేమూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగరాజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

బయట ఉపన్యాసాలు కాదు సభకు రండి జగన్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రజలచే ఎన్నుకోబడిన వారు, ప్రజాసమస్యలపై చట్టసభల్లో గళం విప్పాలి.. కానీ జగన్ సహా ఆయన పార్టీ ఎమ్మెల్యేలు సభలకు రాకుండా బయట ఉపన్యాసాలిస్తూ కాలం గడపడం ఎంతవరకు సబబు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 18 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ సభ్యులు హాజరై, రాష్ట్రంలోని సమస్యలపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. శాసనసభలో జగన్ లేవనెత్తే ఏ అంశంపైనయినా చర్చించడానికి, వాస్తవాలు తెలియచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత

● పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం



ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్త మానవాళికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు మొహమద్ నజీనా బేగం అన్నారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో ఐటీసీ, కాలుష్య నియంత్రణ మండలి, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నజీనా బేగం మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరగడంతో ఓజోన్ పొరకు ప్రమాదం ఏర్పడిం దన్నారు. దీంతో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతిం దన్నారు. రాబోతున్న విధ్వంసాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకం చేపట్టాలని పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కో ఆర్డినేటర్ డీ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఓజోన్ పొరపై దుష్ప్రభావం చూపే రసాయన సమ్మేళనాలన్నింటిని నియంత్రించి, విరివిగా మొక్కలను నాటాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఓజోన్ పొరపై డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ జ్యోత్స్నకుమారి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర జిల్లా సమన్వయ కర్త సంతోష కుమారి, ఐటీసీ ఎమ్ఎస్కే అండ్ ఫిన్‌ఫ్ సొసైటి ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణ, ఎన్జీవోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


14 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 588.30 అడుగులు ఉంది. ఇది 306.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7029 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967 క్యూసెక్కులు, 14 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,10,908 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,63,104 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,42,576 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 1,49,318 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టునుంచి పులిచింతలకు 1,49,318 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కెవెంకటరమణ,ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు చెప్పారు.ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 9 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 1,41,165 క్యూసెక్కులు,రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం 8153 మొత్తంగా 1,49,318 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.సోమవారం అర్ధరాత్రి 12గంటలవరకు 0.063 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 1,44,096 క్యూసెక్కుల నీరొస్తుండగా రిజర్వాయర్ 75.45 మీటర్లమేర నీ రుండగా ఈ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు.


టెయిల్‌పాండ్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పశ్చిమడెల్టాకు 4513 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 4513 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమ ట్టం ఉండగా దిగువకు 25,375 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాలసబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు నీటివిడుదల నిలిపివేశారు. రేపల్లెకాల్వకు 1196 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 376 క్యూసెక్కులనీరు,పశ్చిమకాల్వకు196క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 384 క్యూసెక్కులనీరు, కొమ్మ మూరు కాల్వకు 1818 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 44.08 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 87,314 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఐదు గేట్ల ద్వారా 1,20,548 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,37,548 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కోడెల ఆశయాలను నెరవేర్చాలి

● మెగా వైద్యశిబిరంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ


డాక్టర్ కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోడెల శివరామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఆశయాలను నేరవేర్చాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని కోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సంద ర్భంగా ఆసుపత్రిలో కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ కామినేని ఆసుపత్రి, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె, నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 962 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో గుండె సమస్యలు ఉన్నవా రిని 36 మందిని, నేత్ర సమస్యలు ఉండి ఆపరేషన్ అవసరమైన వారిని 302 మందిని గుర్తించడం జరిగింది. కామినేని ఆసుపత్రి నుంచి డాక్టర్ భార్గవి, డాక్టర్ వై నవ్యనాథ్‌లు వైద్య సేవలు అంద జేశారు. శంకర నేత్రాలయం నుంచి డాక్టర్ రమ్య, సైదారావులు సేవ లు అందజేశారు. ముందుగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ ఉన్నంత కాలం ధైర్యాన్ని, గౌరవాన్ని ఇచ్చి అండగా నిలిచిన నాయకుడు కోడెల శివప్రసారావు అని కోడెల శివరామకృష్ణ అన్నారు. మిమ్మల్ని నేను కాపాడు కోవాలని, నన్ను నడిపించాలన్సిన బాధ్యత మీ అందరిమీద ఉందన్నారు. ఆయన కలలను నేరవేర్చినప్పుడే కోడెల రుణం తీర్చుకున్నవాళ్ళం అవుతామన్నారు, మా చిన్న వయస్సులోనే కలలో కూడా ఊహించనంత గౌరవాన్ని ఇచ్చిన కోడెల అభిమానులు మీరన్నారు. అనంతరం కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మాలపాటి ప్రభాకర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బొడ్డపాటి పేరయ్య, ఏడుకొండలు, వసుందర, కదం నాగజ్యోతి, గట్టుపల్లి సత్యనారాయణ, కొలికొండ కొండలు, మందాడి రవి, కొక్కి రాల శ్రీనివాసరావు, కొల్లి ఆంజనేయులు, మహిళలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోటార్ బైక్ దొంగల అరెస్టు

15 ద్విచక్రవాహనాలు స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

ఈపూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 15 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం హనుమంతురావు తెలిపారు. ఈపూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్రవాహనాల చోరీపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా నరసరావుపేట వరవకట్టకు చెందిన షేక్ అష్రఫ్,షేక్ జమీరా మీరా ఉరఫ్ రింగా, కుంకల గుంట గ్రామానికి చెందిన మేదర మిట్ల గణేష్, నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన షేక్ సల్మాన్‌లు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సా చేస్తున్నారు. ముప్పాళ్ళ రోడ్డులోని గోపువారిపాలెం అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ హనుమంతురావు తెలిపారు. వారి వద్ద నుండి 6 బుల్లెట్లు,3 యూనికాన్‌లు,5 స్కూటర్లు,1 షైన్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు, ఈపూరు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు, సిబ్బందికి రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఈ సంబర్భంగా డీఎస్పీ తెలిపారు.

రంగా వర్సిటీలో పీజీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్స రానికి వివిధ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంబీఏ(ఏబీ), పీహెచ్‌డీ, ఎంబీఏ(ఏబీ-ఎస్ఎఫ్‌క్యూ) ప్రోగ్రాముల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 వరకు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి, హార్డ్ కాపీని వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఈ నెల 22లోగా వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందించాలని సూచించారు.

మత్స్యశాఖ పథకాల అమలుకు తాజా మార్గదర్శకాలు జారీ

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ గల లబ్ధిదారుల పథ కం, ప్రాజెక్టులు సజావుగా అమలు చేయడానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కొన్ని సవరణలతో మంగళవారం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అలా గే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.50 లక్షల కంటే తక్కువ, రూ.50 లక్షల కంటే ఎక్కువ వ్యయంతో గ్రౌండింగ్ చేసిన యూనిట్లలో వాస్తవ పరిస్థితిని నిర్ధారించడానికి జిల్లా మత్స్యశాఖ అధికారి చైర్మన్‌గా కమిటీని నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది.

21 పోస్టులతో 5 ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ మంగళవారం ఐదు నోటిఫికేషన్లు జారీచేసింది. రెండు జూనియర్ లెక్చరర్, ఒక బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, అటవీ శాఖలో 13 డ్రాఫ్ట్‌మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్, గ్రామీణ తాగునీటి విభాగంలో మూడు ఏఈఈ, ఉద్యాన శాఖలో రెండు హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేసింది. ఇందులో మొదటి రెండు నోటిఫికేషన్లకు అక్టోబరు 7 వరకు, మిగిలిన మూడు నోటిఫికేషన్లకు 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

స్పౌజ్ టీచర్లందరికీ బదిలీలు చేపట్టాలి: ఏపీటీఎఫ్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లందరికీ అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పాఠశాల విద్యాశా ఖను కోరారు. గత నెలలో ఇచ్చిన అంతర్ జిల్లాల బదిలీల మార్గదర్శకాలకు అనుగుణంగా స్పౌజ్ కోటాలో బదిలీకి అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే ఆయా జిల్లాల్లో ఉండే ఖాళీలు, అవసరం, మిగులు ఆధారం గా కొన్ని దరఖాస్తులను ప్రభుత్వ అనుమతికి పంపకపోవ డంతో ఆ టీచర్లు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. దర ఖాస్తు చేసుకున్న అందరికీ కొత్త డీఎస్సీ నియామకాలకు ముందే బదిలీలు చేపట్టాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

చరిష్మా సూపర్ మార్కెట్ నిర్వాహకులపై చీటింగ్ కేసు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చరిష్మా సూపర్ మార్కెట్ నిర్వాహకులు ఏలూరు నాగేశ్వరరావు, ఏలూరు స్రవంతి, ఏలూరు చరిష్మాలపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తాను చరిష్మా సూపర్ మార్కెట్ వారు నిర్వహించిన మూడు లక్కీ స్కీముల్లో సభ్యునిగా ఉన్నానని.. నెలకు రూ.2000 చొప్పున 36 నెలలు పైకం చెల్లించానని దండా అనిల్ కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమయం ముగిసినా డ్రా తీయడం లేదని.. నగదు కూడా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనిల్ కుమార్‌తో పాటు మరో ఏడుగురు కూడా తాము మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు. బాధితులు కొన్ని వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

చోరీపై పోలీసుల దర్యాప్తు

నాదెండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూబాడు గ్రామంలో జరిగిన నగదు చోరీపై నాదెండ్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం గ్రామానికి చెందిన దుద్దుకూరి పోలు రాజు కుటుంబ సభ్యులు పొలం వెళ్ళగా ఇంటితో పాటు బీరువా తాళాలు పగల గొట్టి రూ. 3 లక్షల నగదును చోరీ చేశారు. పోలు రాజు గొర్రెలను అమ్మగా వచ్చిన సొమ్మును సోమవారం బ్యాంకులో జమ చేసి ఆభరణాల రుణాన్ని రెన్యువల్ చేయించు కోవాలని భావించారు. ఐతే పొలం నుంచి వచ్చేటప్పటికీ నగదు చోరీ జరిగింది. ఈ విషయంపై బాధితుడు ఫిర్యాదు మేరకు నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. బాధితుడి వద్ద డబ్బు ఉన్న విషయం తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా రత్న షీలామణి



ఏఎన్‌యూ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవి ద్యా లయం ఆంగ్ల విభాగ ఆచార్యులు, ప్రస్తుత వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కే రత్న షీలామణి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 84 పేరుతో ప్రభుత్వ కార్య దర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లపాటు ఆమె పదవిలో ఉంటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కే రత్న షీలామణిని వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఏపీ ఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పు


ఏవీవీఎస్ స్వామి ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్

ఏఎన్‌యూ సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉన్నత విద్యా మండ లి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా అనుబంధ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు మంగళవారం కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి తెలిపారు. వెబ్ ఆప్షన్స్ కళాశాలల ఎంపిక ప్రక్రియ ఈనెల 17వ తేదీ వరకు జరుగుతాయని, వెబ్ ఆప్షన్స్ కళాశాల మార్పు 18వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ప్రక్రియ ఈ నెల 20వ తేదీన జరుగుతుందన్నారు. 22 నుంచి బీఈడీ తరగతులు ప్రారంభమవు తాయన్నారు. ఆయా కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలని కోరారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో నాలుగో విడత ప్రవేశాలకు ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ ఏపీ డాట్ జీవో వీ డాట్ ఇన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ తెనాలి, జిల్లా స్థాయి శిక్షణా కేంద్రము, ప్రభుత్వ ఐటీఐ గుంటూరులో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు, 9391402683 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నాగార్జున కొండను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్


లాంచీ స్టేషన్ వద్ద ఆర్టీఐ కమిషనర్ సునీల్

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ మంగళవారం సందర్శించారు. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో ఆయన కొండకు చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహంను సందర్శించారు. నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను పర్యాటక శాఖ ఉద్యోగులు ఆయనకు వివరించారు. ముందుగా ఆయన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయన వెంట సివిల్ సప్లయి డీటీ బాషా, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఆర్ఐ అనిల్‌కుమార్, వీఆర్వో రవికుమార్ తదితరులు ఉన్నారు.

రావిపాడులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నరసరావుపేట రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో పక్కా సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేయగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద సుమారు 250 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ ఈ సంబర్భంగా తెలిపారు.

గోనేపూడి వాగులో గల్లంతైన యువకుడు మృతి


వినయ్ (ఫైల్‌ఫోటో)

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) నరసరావుపేట మండలం గోనెపూడి గ్రామంలో గల వాగులో ఆదివారం సాయంత్రం గల్లంతయిన యువకుడు వినయ్ (16) మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమయింది. ఆదివారం నరసరావుపేట మండలం గోనేపూడి - చింతలపాలెం గ్రామాల మధ్యగల వాగు ఉధృతంగా ప్రవహించింది. గోనెపూడి గ్రామానికి చెందిన వినయ్ తన మోటార్ సైకిల్ పై వాగుని దాటే క్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సోమవారం సాయంత్రం వాగు ఉధృతి తగ్గటంతో వినయ్ మృతదేహం వాగులో ఉన్న రెండు సమాధులు మధ్యలో చిక్కుకొని ఉంది. వినయ్ మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పంచినామా నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. వినయ్ మృతి చెందడంతో గోనేపూడి గ్రామంలో విషాదఛాయలు అల ముకున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

42,929 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,052 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,929 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,801 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10500	14300	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13400	334	10500	14200
273	10000	13500	నెంబరు. 5	10000	13500
341	10000	15000	273	10000	13700
4884	---	----	341	11000	15800
సూపర్ 10	11500	14000	4884	10000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	16000
బ్యాడిగి	10000	16000	దేవనూరు డీలక్స్	10500	14300
దేవనూరు డీలక్స్	10000	13800	తాలుకాయలు	5000	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సాగు చేసే ప్రతి రైతుకు యూరియా ఇస్తాం : కలెక్టర్



డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేయటం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలో యూరియా పంపిణీ చేసే రైతు సేవా కేంద్రాల వివరాలు ముందుగానే రైతులకు తెలియజేయాలని వ్యవసాయాధికారులకు ఆయన సూచించారు. మంగళవారం జిల్లాలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కెలు, పీఏసీఎస్‌లు మొత్తం 27 కేంద్రాల ద్వారా 465.7 మెట్రిక్ టన్నుల యూరియాను 4,236 మంది రైతులకు పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇంకా 60 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు.

డీజీపీని కలిసిన బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్



రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల,సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన డీజీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రమాద బీమా చెక్కులు అందజేత



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్లరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబానికి 5 లక్షల ప్రమాద బీమా చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ అందజేశారు. బాపట్ల పట్టణం 6వ వార్డుకు చెందిన షేక్ సుభానీ, బాపట్ల పట్టణం యాదవపాలెంకు చెందిన పేరలి శివయ్య, బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన మల్లంపాటి అప్పారావు, బాపట్ల మండలం కంకటపాలెం గ్రామానికి చెందిన రావిపూడి సురేష్‌బాబు, స్టూవర్టుపురం గ్రామానికి చెందిన డి.ప్రసాద్ ప్రమాదంలో మరణించగా వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు.

కార్మికులను గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనం కల్పిస్తాం

● కమిషనర్ జి.రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) : నమస్తే పథకం ద్వారా వ్యర్థ సేకరణ కార్మికుల పేర్లు నమోదు చేసి గుర్తింపుకార్డులు ఇవ్వటం, వారికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీ ఎస్టీకాలనీలో మంగళవారం నమస్తే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రారంభమైన నమస్తే పథకం ద్వారా వ్యర్థసేకరణ కార్మికులను నమోదు చేయటం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక అభివృద్ధి పథకాలతో వారిని అనుసందానం చేసి తద్వారా సామాజిక, ఆర్థికస్థితి గతులను మెరుగుపర్చటం ప్రభుత్వం ద్వారా 5లక్షల వరకు ఇన్సూరెన్స్ నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 మంది వ్యర్థ సేకరణ కార్మికుల పేర్లు నమోదు చేయించుకోవటం జరిగిందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ టి.అనీల్‌కుమార్, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, సి.హెచ్.కరుణ, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన

బాపట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌డీపీఎస్ చట్టాలు, వాటి అమలు విధానాలపై పోలీసు సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఈగల్‌సెల్ సీఐ జి.రవికుమార్ జిల్లాలోని 100 మంది పోలీసు సిబ్బందికి చట్టాలపై సమగ్ర పరిజ్ఞానం పెంపొందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాల క్రయ, విక్రయాలకు పాల్పడేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని వాటిని జిల్లాలో పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈగల్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, ఎం.రాంబాబు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

ర్యాష్‌డ్రైవింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు : సీఐ

బాపట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు హెచ్చరించారు. పట్టణంలో అధిక స్పీడ్‌తో వాహనాలు నడుపుతూ సైలెన్సర్‌తో షాట్‌లు వేస్తున్న, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలతో పట్టణంలో హల్‌చల్ చేస్తున్న యువతకు పట్టణ పోలీసుస్టేషన్ దగ్గర మంగళవారం సీఐ రాంబాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు.

సీరియస్ స్క్వాష్ పోటీలకు హైవెండ్ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన హైవెండ్ హైస్కూల్ క్రీడాకారులు

కర్లపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు సీరియస్ స్క్వాష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని మేనేజింగ్ డైరెక్టర్ బొద్దు సాయిమహేంద్రబాబు తెలిపారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో మంగళవారం జరిగిన సీరియస్ స్క్వాష్ ఆటల పోటీలలో విద్యార్థులు పాల్గొని అండర్ -14, 17 విభాగాలలో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. అండర్-14లో చందన, వర్షిత, స్వర్ణలత, అమృతవర్షిణి, అండర్-17 విభాగంలో గీతిక, శ్రావణి, అక్షయ, శ్రీలక్ష్మి, అండర్-14 బాలుర విభాగంలో వివేక్, అభినవ్, అరుణ్, కిషోర్, అండర్ -17 విభాగంలో శ్రీహర్షవర్ధన్ ఎంపికయ్యారన్నారు. కాకినాడ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో గుంటూరు జిల్లా తరుపున హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఛైర్మన్ ఉదయచంద్రరావు, డైరెక్టర్ చాంధిని, ఆంజనేయప్రసాద్, వెంకటజ్యోతి, పీడీ బత్తుల వీరశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

బాపట్ల మెడికల్ కాలేజిని ప్రభుత్వమే నిర్మించాలి : సీపీఎం

బాపట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మెడికల్ కాలేజిని ప్రభుత్వమే నిర్మించాలని, మెడికల్ కాలేజిలను పీపీపీ పద్ధతిని చేపట్టడం తగదని సీపీఎం జిల్లాకమిటీ కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో బాపట్ల మెడికల్ కాలేజిని ప్రభుత్వం నిర్మించాలని జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షపార్టీలు, దళిత ప్రజాసంఘాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ బాపట్ల ప్రభుత్వ వైద్యకళాశాలను ప్రభుత్వమే నిర్మాణ బాధ్యతలు చేపట్టి నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూ డమెక్రసి నాయకులు మేకల ప్రసాద్, సమాజ్‌వాదిపార్టీ నాయకులు గొర్ల శ్రీనివాసరావు, బీఎస్పీ నాయకులు జి.రాజారావు, దళిత ప్రజాసంఘాల నాయకులు టి.కృష్ణమోహన్, పి.కొండయ్య, సి.హెచ్ మణిలాల్, కె.శరత్, వినయ్‌కుమార్, ఆర్.చంద్రశేఖర్, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డివిజినల్ స్థాయి క్రీడాకారుల ఎంపికకు క్రీడా పోటీలు

చెరుకుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల చెరుకుపల్లిలో బాలికల అండర్-14, 17 డివిజినల్ స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలలో జూనియర్, సీనియర్‌లకు ఖోఖో, కబడ్డీ, చెస్, యోగ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో నవీన్‌కుమార్, లాజర్ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు కె.శ్రీనివాసరావు, తుమ్మా బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, పద్మావతి, తరుణ్ పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా సరుకులు పంపిణీ చేయాలి

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యవసర సరుకులను ఎలాంటి అవకతవకలు లేకుండా రేషన్ డీలర్లు లబ్దిదారులకు అందించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. ఎవరైనా డీలర్లు అక్రమాలకు పాల్పడితే వారికి రేషన్ నిర్వహణకు చివరి రోజు అవుతుందని డీలర్లను హెచ్చరించారు. మంగళవారం కొల్లూరులోని దక్షిణపు వీధిలో ఉన్న రేషన్ దుకాణం వద్ద ఎమ్మెల్యే లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తొలుత ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేషన్ పంపిణీలో తలెత్తుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించడానికి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను జారీ చేస్తుందన్నారు. స్మార్ట్ కార్డు వలన బయోమెట్రిక్ విధానానికి స్వస్తి పలికామన్నారు. స్మార్ట్ కార్డు ద్వారా స్వైప్ చేసి లేదా స్కాన్ చేసి లబ్దిదారులు సరుకులు పొందవచ్చన్నారు. సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి 2జి నెట్‌వర్క్ నుంచి 5జి నెట్‌వర్క్ తీసుకు రావడం వలన పంపిణీ వేగవంతంగా జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డుల నుంచి పాసు పుస్తకాల వరకు ఫొటోలకు పరిమితమైందని, ప్రతి దాని మీద అప్పటి ముఖ్యమంత్రి తన ఫొటోలు వేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో స్మార్ట్ కార్డుల మీద ముఖ్యమంత్రి ఫొటో లేదని చెప్పారు. భవిష్యత్తులో స్మార్ట్ రేషన్ కార్డు వలన బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేస్తూ సూపర్‌సిక్స్‌ను సూపర్‌హిట్ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రికి అండదండగా ఉండాలని కోరారు. పంపిణీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు షైనేని మురళీకృష్ణ, ఎఎంసీ ఛైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ జీఎల్‌జి భగవాన్, పాల సొసైటీ అధ్యక్షులు సుంకర రాంబాబు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, వీఆర్వో రామారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత

● నియోజకవర్గంలో 50 వేల స్మార్ట్ కార్డులు

● ఆర్డీవో రామలక్ష్మి



రేపల్లెలోని రేషన్ షాపులో స్మార్ట్ రేషన్‌కార్డులు అందిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్మార్ట్ కార్డులను అందిస్తుందని, వాటి ద్వారా రేషన్‌తీసుకోవటం సులభతరమవుతుందని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎంపిఏ రోడ్డులో 6వ నెంబర్ రేషన్‌షాపులో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను ఆర్డీవో రామలక్ష్మి, మంత్రి సోదరుడు శివప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైనా ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్‌ను తీసుకోవచ్చని సూచించారు. నియోజకవర్గంలో సుమారు 50 వేల స్మార్ట్ కార్డులు అందివ్వటం జరుగుతుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులో తప్పులు ఏమైనా ఉంటే అక్టోబరు 30వ తేదీలోపు సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, డీలర్ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు జీపీ రామారావు, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, యలవర్తి లక్ష్మి, పట్టణంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు అన్ని విధాలా ఉపయోగపడతాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. చెరుకుపల్లిలోని రేషన్‌షాప్ నెంబర్-240లో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను శివప్రసాద్, ఆర్డీవో రామలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ పీవోసీ, చెరుకుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ఓంకార్, రేషన్ డీలర్స్ అధ్యక్షుడు నాగుల పున్నారావు, మండలంలోని డీలర్లు, కార్డుదారులు పాల్గొన్నారు.

40,231 స్మార్ట్ న్యూ రేషన్‌కార్డులు : తహసీల్దార్

బాపట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, మండలంలోని 93 రేషన్ దుకాణాల పరిధిలో మొత్తం 40,464 రేషన్‌కార్డులు ఉండగా స్మార్ట్ న్యూ రేషన్ కార్డులు 40,231 వచ్చాయని తహసీల్దార్ షేక్ సలీమా తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రేషన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యులైతే ఓటీపీ ద్వారా రేషన్ తీసుకోవచ్చని తెలిపారు. ఆయా దుకాణాల పరిధిలోని సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీకి సిద్ధం : తహసీల్దార్

కర్లపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రేషన్ కార్డుదారులందరికి స్మార్ట్ రైస్ కార్డులు ఇవ్వనున్నామని కర్లపాలెం తహసీల్దార్ షాకీర్ పాషా తెలిపారు. మండలంలో 16,489 స్మార్ట్ రైస్ కార్డులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయని కార్డులన్నిటిని మండలంలోని 37 చౌకదుకాణాల పరిధిలో ఉన్న రేషన్ కార్డుదారులందరికి సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జగన్నాధమాధవ్, డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఉన్నారు.

చందోలులో...

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామ సచివాలయంలో మంగళవారం లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్‌ఖాసీం సంయుక్తంగా కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, గ్రామపంచాయతీ కార్యదర్శి బి.సుజాత, వీఆర్వో అరుణప్రసన్న, సచివాలయ సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామపంచాయతీలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రైస్‌కార్డులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు.

అమృతలూరు మండలంలో...

అమృతలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. యలవర్రులో 26, 27వ రేషన్ దుకాణం వద్ద జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, పార్టీ నాయకులు శరణుగిరిలు రేషన్ వినియోగదారులకు స్మార్ట్ రైస్ కార్డులు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో 13815 మందికి ఈ స్మార్ట్ కార్డులను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో త్రికళరత్న, మాథ్యూస్, ఓలేటి వసంతరావు, బెల్లంకొండ అశోక్, మత్తయ్య, గోవాడలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మండవ విజయలక్ష్మి చేతుల మీదగా కార్డులు పంపిణీ చేశారు.

చుండూరు మండలంలో...

చుండూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన లబ్ధిదారులందరికి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందని తహసీల్దార్ నాగరాజారావు మంగళవారం తెలిపారు. 14706 స్మార్ట్ రేషన్‌కార్డులు ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వలివేరులో టీడీపీ మండల అధ్యక్షుడు తమ్మా శివారెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఉచితంగా ఈ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ డీలర్ల ద్వారా రేషన్ పొందవచ్చన్నారు. ఈ కార్డులు 5జి నెట్‌వర్క్ కావడం వలన వేగంగా ప్రజా పంపిణీ జరుగుతుందన్నారు. ఉద్యోగులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నానో యూరియా ప్రయోజనకరం : ఏవో

వేమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుళికల రూపంలో ఉండే సాధారణ యూరియా వాడకం కన్నా నానో యూరియా పిచికారీ చేయడం ద్వారా ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని ఏవో ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. ఆయన మండలంలోని జంపని, పోతుమర్రు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి క్షేత్రాలను సందర్శించారు. అనంతరం గ్రామాల్లో నిర్వహించిన రైతు సమావేశాలలో ఆయన మాట్లాడుతూ సాధారణ యూరియా వాడటం ద్వారా చాలా వరకు ఆవిరి అయ్యే అవకాశం ఉందని, నానో యూరియా పిచికారీ చేయడం ద్వారా 90 శాతం వరకు మొక్కకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రెండు గ్రామాల వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, పి.రమేష్‌రెడ్డి, నికేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీకాలనీవాసుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతా

● బాపట్ల ఎన్‌టీఎఫ్ అధ్యక్షుడు దేవరకొండ రాము

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు, పిట్టలవానిపాలెం, జిఎన్‌పాలెం, కోడూరు, అలకాపురం గ్రామపంచాయతీలలోని ఎస్టీకాలనీలలో వివిధ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని బాపట్ల ఎన్‌టీఎఫ్ అధ్యక్షుడు దేవరకొండ రాము తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌టికాలనీలో తాగునీరు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఇంటిస్థలాలు, జనన, మరణ సర్టిఫికెట్‌లు, విద్యుత్ సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఏలు ఎం.వెంకటరాజేష్, జెవి శివయ్య, కె.సాహితి, పి.నాగలక్ష్మీ, ఎండి సయిాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా రైతులను ఆదుకోవాలి



బాపట్ల డీఎం కరుణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీసీసీ జనరల్ సెక్రటరి అంజిబాబు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ పిలుపు మేరకు జిల్లా మార్క్‌ఫెడ్ బాపట్ల డీఎం కరుణ్రీని మర్యాదపూర్వకంగా కలిసి యూరియా కొరత గురించి వినతిపత్రాన్ని ఏపీసీసీ జనరల్ సెక్రటరి గంటా అంజిబాబు అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆమె రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. బాపట్ల జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ సంపత్‌కుమార్, తాడికొండ వెంకటేశ్వరరావు, బాపట్ల టౌన్ అధ్యక్షుడు దేవరాజు పాల్గొన్నారు.



వేమూరు హైస్కూల్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేమూరు హైస్కూల్‌లో స్వచ్ఛభారత్

వేమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రపరిచారు. 21వ తేదీ వరకు ప్రభుత్వం పంపిన షెడ్యూల్ ప్రకారంగా నిర్వహించే కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

కొల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభిస్తారని వైద్యురాలు కావ్య మంగళవారం తెలిపారు. కొల్లూరులో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో నిపుణులైన వైద్య బృందంతో స్త్రీ, పురుషులకు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో ఉచితంగా క్యాన్సర్, టీబీ, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు గర్భవతులు, బాలింతలకు ఆరోగ్యసూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

అమృతలూరులో మండల స్థాయి క్రీడలు

అమృతలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రీడా పోటీలను హెచ్‌ఎం నిరీక్షణరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు, క్రీడలతో పాటు, విద్యలో కూడా రాణించాలని సూచించారు. ఉపాధ్యాయలు శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ, రవి, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేత

రేపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల మహిళా సమాఖ్య పరిధిలోని వీవోఏకి స్త్రీనిధి, బయోమెట్రిక్ డివైజ్‌ను మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మంగళవారం అందించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలానికి 51 బయోమెట్రిక్ డివైజ్‌లు ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శాంతి పూర్ణ, టీడీపీ నాయకులు ఎల్.గుడారంకయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రైతు సంక్షేమానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డు కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ పంట రైతుల చేతికి వచ్చే నాటికి యార్డులోని గోదాములు మొత్తం మరమ్మతులు చేయించాలన్నారు. గోదాములలో ధాన్యం నిల్వ చేసుకున్న రైతులకు రుణసదుపాయం కల్పించాలన్నారు. ధాన్యం నిల్వ చేసుకున్న వారికి 6నెలలు వరకు అద్దె ఉండదని, ఆ తర్వాత క్వింటాకు రూపాయి చెల్లించాలనే విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీల పేరు చెప్పుకొని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సరిగ్గా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈవీఎంలకు కేటాయించిన గోదాముల తాలూకా నెలకు అద్దె 2లక్షల 508 రూపాయల చొప్పున ఇప్పటివరకు 54 లక్షల రూపాయలు రావాల్సి ఉందన్నారు. అదేవిధంగా జీడీసీఎంఎస్‌కు కేటాయించిన రెండు గోదాముల తాలూకా అద్దెకూడా చెల్లించాల్సి ఉందన్నారు. మొత్తం గోదాములు మరమ్మతులు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చేస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఏపూరి భూపతిరావు, డైరెక్టర్‌లు అడపాల శ్రీరామయ్య, గొట్టిపాటి శ్రీకృష్ణ, కారుమంచి వెంకాయమ్మ, మన్నె సునీత, గుడిపల్లి శారద, క్రోసూరి నాంచారమ్మ, పమిడి శివపార్వతి, నిజాంపట్నం నాగరాజు, కారుమూరి శారాకుమారి, పఠాన్ కరీముల్లా, షేక్ అబ్బూరూన్, చుక్కా నర్మద, మార్కెట్ యార్డు అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ నియమించాలంటూ వినతి

12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, నాలుగు విడతలుగా బకాయి పడిన డీఏను మంజూరు చేయాలని, అన్ని రకాల ఆర్థిక బకాయిలను చెల్లించాలని, అనవసరమైన యాప్‌లను తొలిగించాలని, సీపీఎస్ రద్దు చేసి మెమో నెంబరు 57 తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకుడు ఎ.శేఖర్‌బాబు, పీడీ సోషలిజం, టి.శ్రీనివాసరావు, మాడుగుల కిషోర్, జంపాని శ్రీనివాసరావు, విజయబాబు తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తకు రూ.1.58 లక్షల ఆర్థిక సాయం

కొల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు అందించిన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యకర్తకు మంగళవారం అందజేశారు. కొల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఇటీవల దుండగులు టాటాఎస్ వాహనాన్ని దగ్ధం చేయడంతో నష్టపోయిన బాధిత కార్యకర్త బుర్రి జగజ్జీవన్‌రావును ఆదుకునేందుకు పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ నడుం కట్టారు. తన వంతు ఆర్థిక సాయంతో పాటు మరికొంతమంది నుంచి రూ.1.58 లక్షల నగదును సేకరించి ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, డీసీ అధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పోతార్లంక కుటుంబరావు, పార్టీ నాయకులు కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల కృష్ణారావు, గాదె చంటి, యడ్ల శ్రీను, పెదపూడి నాగరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తకు పార్టీ నాయకులు అందించిన ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే ఆనందబాబును కోరిన పంచాయతీ కార్మికులు

వేమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'ప్రభుత్వం ద్వారా మా సమస్యలు పరిష్కరించి సహకరించండి...' అంటూ మండలంలోని పంచాయతీ కార్మికులు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును కోరారు. మండలంలోని జంపని గ్రామానికి విచ్చేసిన ఆనందబాబును మంగళవారం కార్మికులు కలుసుకుని తమ సమస్యలను వినతి పత్రం ద్వారా సమర్పించారు. వారి పక్షాన ప్రతినిధిగా విచ్చేసిన సీఐటీయూ నాయకుడు అగస్టీన్ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ, పంచాయతీ కార్మికులకు మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా రూ.21 వేల వేతనాన్ని చెల్లించే విధంగా సహకరించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీ కమిషనర్ జూన్ 20ను ఇచ్చిన ఆదేశాల ప్రకారంగా ఆక్యుపేషన్ హెల్త్ అలవెన్స్ రూ.4 వేలు కలిపి మొత్తం వేతనాన్ని రూ.10 వేలు ఇప్పించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కార్మిక సంఘం నాయకులు గుంటూరు పుల్లారావు, రాంబాబు, మరియమ్మ, సరోజని, ఎం.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుందరయ్య

రేపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎస్‌డబ్ల్యూ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విలీన సమస్యలను పరిష్కరించలేదని, ఈ ప్రభుత్వం అయినా పట్టించుకోవాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న డ్రైవర్, కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. స్త్రీలకు ఉపయోగకరంగా ఉన్న స్త్రీశక్తి పథకాన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు, ఆర్టీసీ వైద్యశాలలో మందులు ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఆర్టీసీ ఉద్యోగులు కుమార్, ఎస్.సురేష్, ఎస్‌వీ సాగర్, సీఐటీయూ నాయకులు కె.రమేష్, వై.కిషోర్, యోగానంద్, ఆర్‌సీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి

రేపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేటేరు గ్రామంలోని రైతుసేవాకేంద్రాల పరిధిలో వ్యవసాయ అనుబంధశాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ ఈ పంట నమోదు ప్రతి రైతు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో మహేష్‌బాబు, వీఏఏ రాయల్‌బాబు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటకు ప్రతి రైతు ఈ పంట నమోదు కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏవో ఫారూక్ అన్నారు. మంగళవారం మండలంలోని కావూరు గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వర్షానికి నీట మునిగిన పొలాల రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రజని, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



వినుకొండ బోసుబొమ్మ సెంటర్‌లోని ప్రసన్నరామలింగేశ్వరస్వామి దేవాలయం

● నిత్యకైంకర్యాలకు నోచుకోని వైనం ● ఆక్రమణల్లో ఆలయాల భూములు ● పూర్వవైభవానికి నోచుకోని దేవాలయాలు



పాత శివాలయ ఆవరణలో అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయం

దేవుళ్లకు.. నైవేద్యాలు

వినుకొండటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అవి పురాతన దేవాలయాలు. మొక్కిన వారికి కొం గు బంగారం ఆలయాల్లోని దేవుళ్లు ఉన్నారు. పెద్దఎత్తున భూములు కూడా ఉన్నాయి. వినుకొండలోని ఆయా ఆలయాల్లో దేవుళ్లకు నైవేద్యాలు పెట్టేవారే లేరు. దేవదాయ శాఖ ఈ ఆలయాల్లో నిత్యకైంకర్యాలు జరగడంలేదు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పేరుగాంచిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంతో పాటు పట్టణంలోని పాతశివాలయం, కోదండరామస్వామి ఆలయాలు చారిత్రాత్మక ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. కొండపై రామలింగేశ్వ రస్వామి ఆలయానికి 11 ఎకరాలు, ప్రసన్నరామలిం గేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలకి 65 ఎకరాలు, తిమ్మాయపాలెం రోడ్డులోని రంగనాయక స్వామి దేవాలయానికి 35 ఎకరాలకు అప్పట్లో భక్తు లు సమర్పించారు. కోదండరామస్వామి ఆలయానికి 1920లో 1460 ఎకరాలు భూమి ఉన్నాయని ఆధారాలు ఉండగా ఆక్రమణలు పోను ప్రస్తుతం కేవలం 65 ఎకరాలకు మాత్రమే ఉన్నాయి. ఈ దేవాలయాలకు నిత్యం



కొండపై అసంపూర్తిగా నిలిచిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం

భక్తుల రద్దీ ఉంటుంది. భక్తులు సమర్పించే కానుకలు, చందాల రూపంలో దేవాలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వయంగా శ్రీరాముడు శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతుంది. 11 ఎకరాల భూమి ఉన్నా స్వామివారు దూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయ పునః నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శ్రీరాముడు నిర్మించిన ఆలయాన్ని తొలగించారు అప్పటి నుంచి ఆలయం పునఃనిర్మాణానికి నోచుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామి సన్నిధిలో హోమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ముందుకు సాగడంలేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ఆలయ పనులు చేపడతామని దేవాదాయ శాఖ అధికారి సుధాకరరెడ్డి తెలిపారు.

పాపం.. జ్యోతి

● మూడేళ్ల వయసు నుంచి అంధత్వం
● అండగా ఉన్న తల్లీతండ్రి మృతితో రోడ్డున పడిన వైనం
● ఎనిమిదేళ్ల కుమారుడి పోషణ కోసం భిక్షాటన
● సీఎం కరుణ కోసం అభాగ్యురాలి ఎదురు చూపులు



కుమారుడు సహాయంతో రోడ్డు మీద బిక్షాటన చేస్తున్న పాములపాటి జ్యోతి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

జీవితమంతా కష్టాలే అంటే పాములపాటి జ్యోతి జీవితమే నిదర్శనంగా కనిపిస్తోంది. పుట్టిన మూడేళ్లకే కళ్లు పోయాయి. కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిదండ్రులు హఠాత్తుగా మరణించారు. చేదువాడోడుగా ఉంటాడులే అనుకుని ఓ వ్యక్తి చెయ్యి పట్టుకుంటే బిడ్డ కడుపులో పడగానే వదిలేసి పత్తాలేకుండా పోయాడు. ఇప్పుడు ఆమె నడి రోడ్డు మీద ఉంది. ఎనిమిదేళ్ల బిడ్డను పోషించుకునేందుకు లోకాన్ని సరిగా చూడలేని ఆ తల్లి నానాయాతన పడుతుంది. మేడికొండూరు గ్రామానికి చెందిన జ్యోతి(ప్రస్తుతం గుంటూరులోని పాతగుంటూరు కృష్ణ కల్యాణ మండపం దగ్గర నివాసం ఉంటుంది) మూడేళ్ల వయసులో ఆడుకుంటూ కింద పడటంతో చూపు కోల్పోయింది. అప్పటి నుంచి తండ్రి మల్లేశ్వరరావు, తల్లి రమాదేవి కళ్లు లేని జ్యోతికి కళ్లుగా మారారు. 2007లో తండ్రి మల్లేశ్వరరావు గుండెపోటుతో మరణించిన తర్వాత జ్యోతి తల్లి మీదనే ఆధారపడ్డారు. 2018లో తల్లి రమాదేవి కూడా మరణించటంతో జ్యోతి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తల్లి, తండ్రి మరణించిన తర్వాత పూర్తి అయోమయ స్థితిలో ఉన్న జ్యోతిని వివాహం చేసుకునేందుకు ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. పెళ్లి చేసుకుని కొద్ది రోజులు కాపురం చేసిన తర్వాత చెప్పా పెట్టకుండా వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటికే తాను గర్భం దాల్చానని బాధితురాలు చెబుతున్నారు. అబార్షన్ చేయించుకోవాలని చాలామంది సలహా ఇచ్చినా జ్యోతి అంగీకరించలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత రక్షణకుమార్ అని పేరు పెట్టినట్టు వెల్లడించారు.

బిడ్డ కడుపు నింపటానికి బిక్షాటన...

ప్రస్తుతం పాత గుంటూరు కృష్ణ కల్యాణ మండపం సమీపంలోనిఅద్దె ఇంట్లో నివసిస్తున్న జ్యోతి ఎనిమిదేళ్ల బాబును పోషించుకునేందుకు బిక్షాటన చేస్తున్నారు. బిక్షాటన చేయగా వచ్చిన సొమ్ముతోనే బాబును పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ 'అడుక్కునే వాళ్లు' అనే పేరుతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తన బిడ్డను చిన్నచూపు చూస్తున్నట్లు జ్యోతి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఒక్కో రోజు రోడ్డు మీదకు వెళ్లాలంటే చాలా భయం వేస్తుందని ఆవేదన చెందుతున్నారు. 'రూపాయి ధర్మం చేయమని అడిగితే కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తారని వాపోయారు.

సీఎం కలవాలని ప్రయత్నం చేసినా...

జ్యోతి బయటకు రావాలంటే కచ్చితంగా ఎవరో ఒకరి సాయం ఉండాల్సిందే. అటువంటి పరిస్థితిలో కూడా మూడు, నాలుగు సార్లు సీఎంను కలవడానికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితురాలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ దగ్గరికి వెళ్లినా కూడా అదే అనుభవం ఎదురైందని చెబుతున్నారు.

సీఎం సర్ కనికరించాలి...

ఇప్పటి వరకు ఎన్నో కష్టాలు పడ్డాను. ఇక నా వల్ల కావడం లేదు. సీఎం సర్ దృష్టికి నా విషయం వెళ్తే ఆయన కచ్చితంగా న్యాయం చేస్తారు అన్న నమ్మకం నాకు ఉంది. ప్రస్తుతం ఆయన ఇచ్చే ఆరు వేలు పెన్షన్‌తోనే ఇంటి అద్దె మూడు వేలు, కరెంట్ బిల్లు వెయ్యి చెల్లించి జీవిస్తున్నాను. సీఎం స్పందించి ఇల్లు, బిడ్డ చదువుకి సాయం చేస్తే ప్రశాంతంగా ఉండగలుగుతాను. ఆర్థిక సహాయం చేయాలనుకుంటే 8341233852 నెంబర్‌లో సంప్రదించండి.

-పాములపాటి జ్యోతి, బాధితురాలు

అమ్మా...ఎలా ఉన్నారు?

● అతివల ఆరోగ్యంపై 17 నుంచి ప్రత్యేక శిబిరాలు
● బలమైన కుటుంబానికి పునాది లక్ష్యంతో ముందుకు

సత్తెనపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమే కాదు ఆరోగ్య వంత మైన సమాజం నెలకుంటుంది. మహిళల ఆరోగ్యం బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. అందులోనే పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ ఐతే తీసుకోవాల్సిన చికిత్స పై వివరిస్తారు. రుగ్మతలు ఎలా వ్యాప్తి చెందుతాయో, వాటి భారిన పడకుండా అప్రమత్తంగా ఉండటం పై అవగాహన కల్పిస్తారని వైద్యులు తెలిపారు.

వైద్యుల పర్యవేక్షణలో...

గ్రామీణ, పట్టణాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లలో ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించేలా ఆయా ఆస్పత్రుల వైద్యులకు సూచించారు.

ఏఏ అంశాల పై పరీక్షలు చేస్తారంటే...

అధిక రక్త పోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. మహిళల్లో రక్త హీనత ఎలా వస్తుంది?, దానిని అధిక మించటం ఎలా?, తీసుకోవాల్సిన ఆహారం పై కౌన్సిలింగ్ ఇస్తారు. గర్భిణీల్లో హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు చేస్తారు. శిశు రక్షణ కార్డుల పంపిణీ, పిల్లలకు రోగ నిరోధక శక్తి అందించటం పై అవగాహన కల్పిస్తారు. కౌమార దశలో ఉన్న బాలికలకు రుతు పరిశుభ్రత, పోషకాహార కార్యక్రమం పై అవగాహన కల్పిస్తారు. చెక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించటంపై మహిళా స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ రాజ్ సంస్థలు, మహిళా ప్రతినిధులతో సమావేశాలు, పోషకాహారం పై సూచనలు ఇస్తారు.



అమరావతి బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు

మట్టి నమూనాల సేకరణ

● చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమానులో కొనసాగుతోన్న డ్రిల్లింగ్ వర్క్స్
● శాంపిల్స్ టెస్టింగ్‌కు హరియాణాలోని గురుగ్రాంకు రవాణా
● ఎలైన్‌మెంట్‌పై రకరకాల ఊహాగానాలు

గుంటూరు, వట్టిచెరుకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై వయా అమరావతి రాజధాని హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ప్రాథమికంగా అవసరమైన ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) గుంటూరు జిల్లాలో ప్రారంభ మైంది. ఇందులో భాగంగా డీపీఆర్ రూపకల్పన, ఫైనల్ ఎలైన్‌మెంట్ డిజైన్, ట్రాఫిక్ సర్వే రిపోర్టు, ఆర్‌వోఆర్ లెక్కలు, సవివర అంచనాలు, ఈపీసీ తయారు చేయడం వంటివి చేపట్టారు. అలానే టెరెస్ట్రియల్ లిడార్ సర్వే(గ్రౌండ్ బేస్డ్ లేజర్ సర్వే) కూడా చేపట్టనున్నారు. ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో భారీ యంత్రాలను ఉపయోగించి మట్టి నమూనాలను సేకరిస్తోన్నారు. దాదాపుగా 20 మీటర్ల లోతు వరకు వెళ్లి ప్రతీ ఐదు మీటర్లకు ఒకసారి మట్టి నమూనాని తీసుకొని ప్యాకెట్లలో నింపి వాటిని టెస్టింగ్ నిమిత్తం హరియాణ రాష్ట్రంలోని గురుగ్రాం లేబొరేటరీకి రవాణ చేస్తోన్నారు. దీంతో ఎలైన్‌మెంట్ ఏ ఊళ్ల మీద నుంచి ఉంటుందనే ఆసక్తి సర్వత్రా నెలకొన్నది.



వట్టిచెరుకూరు మండలంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం జరుగుతున్న మట్టి నమూనాల సేకరణ

దేశంలో మొట్టమొదటి హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ అయిన అహ్మదాబాద్ - ముంబై సెక్షన్ పూర్తి కావొస్తోండటంతో ఎన్‌డీఏ-3 ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ - అమరావతి - చెన్నై సెక్షన్‌లో దీనిని నిర్మించాలని ఇప్పటికే ప్రాథమికంగా నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు మీదగా హైదరాబాద్ - చెన్నై ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని ఎలైన్‌మెంట్ చేయాలని ప్రతిపాదించింది. ఆ మేరకు ఇప్పుడు సర్వే జరుగుతోన్నది. ఇందుకోసం 744.57 కిలోమీటర్ల సెక్షన్‌ని ఎంపిక చేశారు. ఫ్యూచర్ సిటీ నుంచి ప్రారంభమై శంషాబాద్, నార్కెడ్‌పల్లి, సూర్యపేట, కోదాడ, అమరావతి రాజధాని, గుంటూరు, చీరాల మీదగా చెన్నైకి ఎలైన్‌మెంట్ చేయాలని భావిస్తోన్నారు.

కాగా ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో మట్టి శాంపిల్స్ తీస్తుండటంతో ఎలైన్‌మెంట్‌పై విస్తృతంగా చర్చలు జరుగుతోన్నాయి. రైల్వే శాఖ ప్రస్తుతం ఉన్న రైలుమార్గానికి సమాంతరంగా ప్రాజెక్టు చేపడితే భూసేకరణ ఖర్చు కొంతమేరకు తగ్గుతుందని సూచించింది. అయితే చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో శాంపిల్స్ తీస్తున్న దృష్ట్యా ప్రస్తుత రైలుమార్గానికి సమాంతరంగా కాకుండా వేరే ఎలైన్‌మెంట్‌లో చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. ఇందుకు కారణం పైన పేర్కొన్న మూడు మండలాల్లో ఎలాంటి రైలుమార్గం లేదు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే అమరావతి మీదగా గుంటూరు వచ్చిన తర్వాత చేబ్రోలు మండలంలోని గొడవర్రు, వట్టిచెరుకూరులోని అనంతవరప్పాడు మధ్యగా లేమల్లెపాడు తూర్పు వైపున కొంతదూరం వెళ్లాక ముట్లూరుకు పడమర వైపు నుంచి కాకుమాను మండలంలోకి వెళుతుంది. ప్రస్తుతం సేకరిస్తున్న మట్టి నమూనాల పరీక్ష ఫలితాలు పాజిటివ్‌గా వస్తే ఎలైన్‌మెంట్ ఇటువైపు నుంచే ఉంటుంది.

దళితవాడల్లో వెయ్యి ఆలయాలు!

● మత మార్పిడులను అడ్డుకునేందుకే టీటీడీ పాలక మండలి నిర్ణయం ● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రంలోని దళితవాడల్లో తొలి దశలో వెయ్యి ఆలయాలను నిర్మించాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. దళితవాడల్లో జరుగుతున్న మతమార్పిడులు అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆయా ప్రాంతాలను బట్టి రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయిస్తామని తెలిపింది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం మధ్యాహ్నం పాలక మండలి సమావేశం జరిగింది. చైర్మన్ బీఆర్ నాయుడు బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించి ఆ తర్వాత ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలక మండలి ఏర్పడ్డాక ఇవే తొలి బ్రహ్మోత్సవాలని.. ప్రతిష్ఠాత్మికంగా తీసుకుని అత్యంత వైభవంగా, దిగ్విజయంగా జరపాలని తీర్మానించామని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. 'రద్దీ నియంత్రణ కోసం తొలిసారి ఇస్రో సహకారం తీసుకోవాలని నిర్ణయించామని, ప్రతినిమిషం వారు రద్దీని పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తూ సందేశాలిస్తారు. ఎల్ అండ్ టీ సంస్థ కూడా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌కు సహకరిస్తుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పది రోజులపాటు సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశాం. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకే వీఐపీ బ్రేక్ దర్శనాలుంటాయి. వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, ఎన్నారైలకు ప్రత్యేక దర్శనాలు నిలిపివేస్తాం. భక్తులకు కావలసినన్ని లడ్డూలు ఇచ్చేలా అదనంగా 8 లక్షల లడ్డూలు తయారు చేయాలని నిర్ణయించాం. 28వ తేదీన గరుడ వాహనసేవ రోజు 3 నుంచి 4 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ రోజు శ్రీవారిమెట్టు, అలిపిరి కాలి నడక మార్గంలో 24 గంటల పాటు భక్తులను అనుమతిస్తాం' అని వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని, 24వ తేదీన మీన లగ్నంలో (సాయంత్రం 5.43-6.15 గంటల మధ్య) ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహన సేవ జరుగుతుందన్నారు. అదే రోజు రాష్ట్రప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. 2026కు సంబంధించిన టీటీడీ డైరీ, క్యాలెండరు ఆవిష్కరించడంతో పాటు మరుసటి రోజు తిరుమలలో నూతనంగా నిర్మించిన పీఏసీ-5 (వెంకటాద్రి నిలయం)ను ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. బ్రహ్మోత్సవాలను మహాయజ్ఞంగా నిర్వహించేందుకు బోర్డు సభ్యులు, అధికారులు, భక్తులు సహకరించాలని కోరారు.

మరికొన్ని నిర్ణయాలు..

- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరంలో ఉన్న శ్రీవారి ఆలయంలో రాజగోపురం, ముఖమండపం, సుబ్రహ్మణ్యస్వామికి ఆభరణాలు, తాగునీటి సౌకర్యం కోసం రూ.7.20 కోట్లు.
- అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక, రాజ గోపురం, తోరణం నిర్మాణానికి రూ.5.73 కోట్లు మంజూరు.
- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో రూ.89.54 లక్షల విలువైన 74 సెంట్ల భూమిని కొనుగోలు చేసి టీటీడీకి విరాళంగా ఇచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన వెంకట్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ముందుకొచ్చారు. ఆ విరాళం స్వీకరించేందుకు ఆమోదం.

కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే జైలుకే

టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బీఆర్ నాయుడు హెచ్చరించారు. 'పనీపాటా లేకుండా ప్రతి చిన్న విషయానికీ టీటీడీపై ఇష్టానుసారం అవాకులు చవాకులు పేలుతున్నారు. అందుకే ఇకపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు పెట్టేలా బోర్డులో తీర్మానించాం. శ్రీవేంకటేశ్వరస్వామిపై రోజూ ఏదో ఒక అవాస్తవంతో దుమ్మెత్తిపోస్తున్నారు. చిన్న విషయాలను పెద్దవిగా చేసి టీటీడీ పరువు ప్రతిష్ఠలను దెబ్బతీస్తున్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి న్యాయవిచారణ చేయించి జైలుకు పంపుతామని చెప్పారు. వేద పారాయణదారుల పోస్టు భర్తీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

ఏపీలో 25వ భారత్ రంగ్ మహోత్సవ్

● వచ్చే ఏడాది ఫిబ్రవరి 6,7,8,9,10 తేదీలలో జాతీయ, అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు
● వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోని అతి పెద్ద అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్ 'భారత్ రంగ్ మహోత్సవ్ 2026'కు ఆంధ్రప్రదేశ్ వేదిక కానున్నట్లు తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అన్నారు. యడ్లపాడులోని వేదిక కార్యాలయంలో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ భారత రంగ్ మహోత్సవ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. గుంటూరుపట్టణంలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో తొలిసారి అదీ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్సవాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని, దాని నిర్వహణ బాధ్యతలు వేదికకు దక్కడం గర్వకారణమన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో జాతీయ, అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు, తెలుగు రాష్ట్రాల కళాకారులచే వివిధ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ నాటక మహోత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నాటకరంగ ప్రముఖులు, కళాకారులు, నాటకరంగ అభిమానులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాపరిషత్‌ల నిర్వాహకులకు, నాటక దర్శకులు, రచయితలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని నాటక సమాజాలవారికి, వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వా నాలు అందజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఈ అంతర్జాతీయ ఉత్సవం జరగడం మనందరికీ గర్వకారణం అని తెలుగు నాటక రంగానికి ఈ ఉత్సవాలు కొత్త ఊపును ఇస్తాయన్నారు. కళా ప్రియులకు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ, విజయవంతం చేయడంపై వేదిక సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో వేదిక కార్యవర్గ సభ్యులు పీవీ మల్లిఖార్జునరావు, జేవీ మోహనరావు, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి, పోపూరి నాగేశ్వరరావు, కట్టా శ్రీహరి, నడింపల్లి వెంకటేశ్వర్లు, ముత్తవరపు రామారావు, లావు వెంకటేశ్వర్లు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం, యడ్లపాడు, కొండవీటి కళా పరిషత్, లింగారావుపాలెం, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్, వరగాని, శ్రీకారం రోటరీ కళా పరిషత్, మార్టూరు, ఎన్టీఆర్ కళాపరిషత్, అనంతవరం, గుంటూరు కళాపరిషత్, గుంటూరు, కాసరనేని సదాశివరావు కళాపరిషత్, తక్కెళ్ళపాడు, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్, సాతులూరు, కళా నికేతన్, వీరన్నపాలెం, ఎన్టీఆర్ కళాపరిషత్, వినుకొండ, పెదకంచర్ల గ్రామీణ కళాపరిషత్, పెదకంచర్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు